బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 16 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


# దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకం



- దేశ భద్రత విషయంలో రాజకీయాలు సరికాదు
- రాడార్ కేంద్రం వల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదు
- సీఎం రేవంత్ అండదండలు మరువలేనివి
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- దేశ రక్షణలో తెలంగాణ కీలకం
- ఈ నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనివే
- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- దామగుండంలో కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్(నేవీ రాడార్ కేంద్రం)కు శంకుస్థాపన

**బలగం టీవి, హైదరాబాద్**

దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. వికారాబాద్ జిల్లా దామగుండం వద్ద రాడార్ కేంద్రానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీలు, మంత్రులు పాల్గొన్నారు. శంకుస్థాపన చేసిన అనంతరం వీఎల్ఎఫ్ కేంద్రం నమూనాను పరిశీలించారు. శత్రు దేశాలపై నిఘా ఉంచేందుకు నౌకాదళం ఈ రాడార్‌ను నెలకొల్పాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 24న రిజర్వు ఫారెస్ట్‌లోని 2,900 ఎకరాలను అటవీ అధికారులు నౌకా దళానికి అప్పగించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశానికి ఎంతో కీలకమైన ప్రాజెక్ట్ ప్రారంభించడం ఎంతో హర్షణీయమైనదన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా శంకుస్థాపన హర్షణీయమన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. దేశ భద్రత, రక్షణ విషయాల్లో రాజకీయాలు చేయకుండా దేశానికి సేవ చేస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశం కోసం ఈ రకమైన రాడార్ స్టేషన్లు ఎంతో ముఖ్యమైనవని, పూర్వంలో సమాచార మార్పిడి కోసం పక్షులను ఉపయోగించామని తెలిపారు. ఇప్పుడు మరింత బలమైన కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. గత ముప్పై సంవత్సరాలుగా భారతదేశం కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కొందరు వ్యక్తులు ఈ ప్రాజెక్ట్‌పై తప్పుడు సమాచారాన్ని ప్రసారం చేస్తున్నారని, పర్యావరణానికి హాని కలిగించదని, ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఈ ప్రాజెక్ట్ పర్యావరణానికి హాని కలిగించదని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ, భద్రత విషయంలో కేంద్రం మరింత కట్టుబడి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

దేశ భద్రత విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కృషి అభినందనీయం అని కొనియాడారు.

రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరు ఉంది. దేశ భద్రతలో రాడార్ స్టేషన్ కీలకం. కమ్యూనికేషన్ రంగంలో టెక్నాలజీ ఎప్పటికప్పుడు మారుతూ వస్తోంది. రాజకీయాలు వేరు.. దేశ భద్రత వేరు. తపాలా వ్యవస్థ అనేక ఏళ్ళు ఉపయోగపడింది. ప్రస్తుతం ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది అని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద రాడార్ స్టేషన్‌గా పూడూరు మండలంలో కేంద్రం ఏర్పాటు చేసినట్టు నిలుస్తుందని సీఎం అన్నారు. దేశ రక్షణలో తెలంగాణ భాగస్వామ్యం కీలకమన్నారు. రాడార్ స్టేషన్ పై కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారన్నారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన విషయాన్ని కూడా రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అబద్ధాలు చెప్పిందని... ఇప్పుడు ఈ అంశంలోనూ బీఆర్ఎస్ నేతలు అవే అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

## గ్రూప్-1 మెయిన్స్‌కు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

గ్రూప్-1 మెయిన్స్‌కు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్లను సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ నెల 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి. ప్రిలిమ్స్‌లోని 7 ప్రశ్నలకు తుది కీలో సరైన జవాబులు ఇవ్వలేదని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. వాటికి మార్కులు కలిపి మళ్లీ జాబితా ఇవ్వాలని కోరారు. వీటిపై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.ఆయా కేసుల్లో ఇప్పటికే విచారణను పూర్తిచేసిన హైకోర్టు తీర్పును సోమవారానికి రిజర్వు చేసింది. అయితే తీర్పును మంగళవారం వెలువరిస్తామని ప్రకటించింది.

గ్రూప్-1పై హైకోర్టులో 15కుపైగా కేసులు ఉన్నాయి. వీటిలో ఫైనల్ 'కీ'పై వేసిన కేసు అత్యంత కీలకమైనది. వీటితోపాటు ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో-33పై దాఖలైన కేసు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి 503 పోస్టులు, కొత్త నోటిఫికేషన్‌లో అదనంగా చేర్చిన 60 పోస్టులకు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి అవకాశం ఇవ్వాలన్న అంశంపై వేసిన కేసు, హైకోర్టు మళ్లీ రీ ఎగ్జామ్ నిర్వహించాలని ఆదేశించిన నేపథ్యంలో, పాత నోటిఫికేషన్‌ను రద్దుచేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వడంపై పలువురు కేసులు వేశారు.

మిగితా 3వ పేజీలో

## రోడ్ల అభివృద్ధికి తెలంగాణకు రూ. 516 కోట్లు



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు రోడ్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ. 498 కోట్లు కేటాయించగా తెలంగాణకు రూ. 516 కోట్ల నిధులను విడుదల చేసింది. ఏపీలో 200.06 కిలోమీటర్ల పొడవైన 13 రాష్ట్ర రహదారులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి నుంచి ఈ నిధులను కేటాయించింది. తెలంగాణలో ఎన్‌హెచ్ 565లోని నకిరేకల్ -టు నాగార్జున సాగర్‌ల మధ్య 14 కిలోమీటర్ల పొడవు, నాలుగు -లేన్‌ల బైపాస్ నిర్మాణానికి రూ.516 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఇక ఏపీలో గుంటూరు టు- నల్లపాడు రైల్వే మార్గంలో శంకర్ విలాస్ ఆర్‌ఓబిని నాలుగు వరుసల నిర్మాణానికి సంబంధించి రూ.98 కోట్లను కేటాయించింది.

తెలంగాణలో నకిరేకల్ -టు నాగార్జున సాగర్‌ల మధ్య బైపాస్ రోడ్డు నిర్మాణంతో నల్గొండ టౌన్‌కు ట్రాఫిక్ తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో మరోవైపు నకిరేకల్ -టు నాగార్జున సాగర్ మధ్య కనెక్టివిటీ పెరగనుంది. ఇక, ఆంధ్రప్రదేశ్ టు- తెలంగాణల మధ్య ఈ జాతీయ రహదారి కీలకంగా మారనుంది. తెలంగాణలోని నకిరేకల్ వద్ద ఎన్‌హెచ్ 65తో జంక్షన్ నుంచి ప్రారంభమై నల్గొండ, మాచర్ల, ఎర్రగొండపాలెం కనిగిరి పట్టణాల మీదుగా ఈ రహదారి వెళుతుంది. ఈ రహదారి అభివృద్ధితో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరింత మెరుగైన రవాణావ్యవస్థను అందుబాటులోకి రానుంది. మరోవైపు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, గోవాతో సహా పలు రాష్ట్రాల్లో పలు ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు.

## పాకిస్థాన్‌కు భారత విదేశీ వ్యవహారాల మంత్రి



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**


షాంఘై సహకార సంస్థ(ఎస్‌సిఓ) సదస్సులో పాల్గొనేందుకు భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ మంగళవారం పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోకి అడుగుపెట్టారు. గడచిన తొమ్మిదేళ్లలో భారత్‌కు చెందిన విదేశీ వ్యవహారాల మంత్రి పాకిస్తాన్‌లో అడుగుపెట్టడం ఇదే మొదటిసారి. రెండు దేశాల మధ్య స్నేహ సంబంధాలు క్షీణించిన తరుణంలో జైశంకర్ పాకిస్తాన్ సందర్శన ప్రాధాన్యతను సంతరించుకుంది. రాజధాని శివార్లలోని నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు జైశంకర్ విమానం ల్యాండింగ్ కాగా సీనియర్ పాకిస్తానీ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. కశ్మీరు సమస్య, పాకిస్తాన్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం కారణంగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగే ఎస్‌సిఓ సదస్సులో భారత ప్రతినిధి బృందానికి జైశంకర్ సారథ్యం వహిస్తారు. పాకిస్తాన్‌ను చివరిగా సందర్శించిన విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్. 2015 డిసెంబర్ 8-9 తేదీలలో ఆమె ఇస్లామాబాద్‌ను సందర్శించారు. అఫ్ఘానిస్తాన్‌పై హార్ట్ ఆఫ్ ఆసియా సమావేశంలో ఆమె పాల్గొన్నారు.

## ఏడు విమానాలకు బాంబు బెదిరింపులు

**బలగం టీవి, హైదరాబాద్**

దేశీయంగా నడిచే, విదేశాలకు వెళ్లే పలు విమానాలకు వరుస బాంబు బెదిరింపులు రావడం ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతోంది. మంగళవారం(అక్టోబర్ 15) ఒక్కరోజే ఏకంగా ఏడు విమానాలకు ఎక్స్(ట్విటర్) వేదికగా బాంబు బెదిరింపులు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో దేశ వ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో భద్రతా సంస్థలు, ఉగ్రవాద నిరోధక డ్రిల్స్‌ను నిర్వహించారు. ఈ బాంబు బెదిరింపుల కారణంగా విమానాల రాకపోకల్లోనూ ఆలస్యం, షెడ్యూల్లో మార్పులు జరిగాయి

మధురై - సింగపూర్, ఢిల్లీ - షికాగో, జైపుర్ - బెంగళూరు, సహా ఏడు విమానాలకు గంటల వ్యవధిలోనే ఈ బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో ఈ విమానయాన సంస్థల సిబ్బంది సహా ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.ఈ ఘటన కలకలం రేపడంతో అప్రమత్తమైన బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీలకు కంప్లైంట్ చేసింది. అనంతరం సంబంధిత ఎక్స్ ఖాతాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. ఈ బాంబు బెదిరింపులు రావడంతో కొన్ని విమానాలు అత్యవసర ల్యాండింగ్ కూడా అయ్యాయి. "దేహ్రాదూన్ నుంచి బయలు దేరిన మా విమానంకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ విమానానికి భద్రతా ముప్పు పొంచి ఉందని ఆన్‌లైన్‌లో పోస్ట్ కనిపించింది. దీంతో తక్షణమే అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ విమానాన్ని ముంబయి ఎయిర్‌పోర్టులోనే సురక్షితంగా ల్యాండింగ్ చేసింది.




## గురుకుల విద్యాలయాలకు తాళాలు..

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో అద్దె భవనాలలో నడుస్తున్న గురుకుల స్కూల్స్ కు సంబంధించి అద్దెలు చెల్లించకపోవటంతో భవన యజమానులు గురుకుల స్కూల్స్ కు తాళాలు వేశారు. గురుకుల విద్యాలయాలకు తాళాలు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యాజమాన్య సంఘం నేడు తమ నిరసన తెలియజేస్తూ అద్దె భవనాలకు తాళాలు వేశారు. గత తొమ్మిది నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవటాన్ని నిరసిస్తూ భవన యజమానులు గురుకుల స్కూల్స్ భవనాలకు తాళాలు వేశారు. దీంతో దసరా సెలవులకు వెళ్లి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు గురుకుల్ స్కూల్స్ భవనాల ముందు పడిగాపులు కాశారు. అయితే ఇప్పటికే నోటీసు ఇచ్చిన నేపథ్యంలో తాళాలు వేశామని అద్దె భవనాల యజమానులు చెప్తున్నారు. బకాయిలు చెల్లిస్తేనే తాళాలు తెరుస్తాం మార్చి నెల నుండి ఇప్పటివరకు గురుకుల స్కూల్స్ కు బకాయిలు చెల్లించనందున, కొన్ని గురుకుల స్కూల్స్ కు గత 30 నెలలకు పైగా అద్దె బాకీల విషయంలో అనేకమార్లు కమిషన్ స్థాయిలో వినతి పత్రాలు ఇచ్చినా ఏ విధమైన స్పందన ఇప్పటికే ఇచ్చిన నోటీసు ఆధారంగా నేడు భవనాలకు తాళాలు వేసి, బకాయిలు చెల్లించిన తర్వాత మళ్ళీ తాళాలు తెరుస్తామని, ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం అని వారు చెప్తున్నారు.

## కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు

- నేడు బడుల్లో రిపోర్టింగ్ చేయనున్న ఉపాధ్యాయులు
- వివిధ కారణాలతో ఉదయం కౌన్సెలింగ్ వాయిదా
- మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైన కౌన్సెలింగ్

వివరాలు 3వ పేజీలో

## మోగిన ఎన్నికల నగరా



**బలగం టీవి, హైదరాబాద్**

మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికల నగారా మోగింది. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం బుధవానెరం ప్రకటించింది. మహారాష్ట్రలో ఒకే దశలో, ఝార్ఖండ్‌లో రెండు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. మహారాష్ట్రలో నవంబర్ 20న, ఝార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 23న చేపట్టనున్నట్లు తెలిపారు.

మహారాష్ట్రలో 288 నియోజకవర్గాలు ఉన్నాయి. 9.63 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. 20.93 లక్షలమంది తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం 1,00,186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఝార్ఖండ్‌లో 81 నియోజకవర్గాలు ఉండగా, 2.6 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. 11.84 లక్షల మంది తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

### మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్

**అక్టోబర్ 22న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్**
**అక్టోబర్ 29 వరకు నామినేషన్ల స్వీకరణ**
**నవంబర్ 4 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు**
**నవంబర్ 20న పోలింగ్**
**నవంబర్ 23న ఓట్ల లెక్కింపు**

### ఝార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్

**అక్టోబర్ 18న మొదటి దశ, అక్టోబర్ 22న రెండో దశ అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్**
**అక్టోబర్ 25 వరకు మొదటి దశ, అక్టోబర్ 29 వరకు రెండో దశ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ**
**అక్టోబర్ 30 వరకు మొదటి దశ, నవంబర్ 1 వరకు రెండో దశ నామినేషన్ల ఉపసంహరణకు గడువు**
**నవంబర్ 13న మొదటి దశ, నవంబర్ 20న రెండో దశ పోలింగ్**
**నవంబర్ 23న ఓట్ల లెక్కింపు**

## రెండు లోక్ సభ, 48 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు



మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం ఇదే సమయంలో 48 అసెంబ్లీ నియోజకవర్గాలు, 2 పార్లమెంటరీ స్థానాలకు ఉపఎన్నికల షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. ఈ ఉప ఎన్నికలు రెండు విడతల్లో జరుపుతున్నట్టు ప్రకటించింది. తొలివిడతలో భాగంగా నవంబర్ 13న 47 అసెంబ్లీ స్థానాలు, కేరళలోని వయనాడ్ పార్లమెంటరీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుంది. రెండో విడతలో భాగంగా నవంబర్ 20న ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ అసెంబ్లీ నియోజకవర్గం ఉపఎన్నిక, మహరాష్ట్రలోని నాందేడ్ పార్లమెంటరీ నియోజకవర్గం ఉపఎన్నిక ఉంటుంది. నవంబర్ 23న ఫలితాలు ఉంటాయి. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ వయనాడ్ కి రాజీ నామా చేయడం తో అక్కడ, కాంగ్రెస్ ఎంపీ వంసతరావ్ బల్వంతరావ్ చవాన్ గత ఆగస్టులో కన్నుమూయడంతో మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరుగుతోంది. వయనాడ్‌లో నవంబర్ 13న ఇక్కడ పోలింగ్ జరగనుంది. ఇక ఈ స్థానం నుంచి రాహుల్ గాంధీ సోదరి ప్రియాంకా గాంధీ పోటీ చేయనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది

## 2 వేల మందితో తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్



- సీఎస్ శాంతికుమారి

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో త్వరలో వినూత్న పద్ధతులతో 2 వేల మందితో తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను అందుబాటులోకి తేనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి తెలిపారు. అధికారులు సమన్వయంతో సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో డీజీపీ జితేందర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో సీఎస్ సమావేశమై తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదనలపై చర్చించారు.

ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగిన ఘటనల నేపథ్యంలో అగ్నిమాపక శాఖకు చెందిన 10 బృందాలు, తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లోని 10 కంపెనీలను వినియోగించి రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సుమారు 2000 మందితో కూడిన బలమైన బలగాలను ఏర్పాటు చేసేందుకు, అవసరమైన బడ్జెట్ కూడా సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేశారని సీఎస్ తెలిపారు.వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండేందుకు సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నారు. వచ్చేనెల మొదటి వారం నుంచి సిబ్బందికి మొదటి బ్యాచ్ శిక్షణను ప్రారంభించాలని ఆమె తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్‌లకు అవసరమైన వాహనాలు, రెస్క్యూ పరికరాలు, వ్యక్తిగత రక్షణ పరికరాలు, ఇతర సాధనాల సేకరణ గురించి కూడా సమావేశంలో చర్చించారు.

అవసరమైన పరికరాలు, శిక్షణ అందించడం ద్వారా అగ్నిమాపక శాఖలోని 10 బృందాలను ఎస్‌డిఆర్‌ఎఫ్

## ఛోటా భాయ్ పాలనలో పత్తి రైతు చిత్తు : కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**



పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం ఆడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎట్టుబడి సాయం అందించేలేదు, నేడు కష్టపడి పండించిన పంటను పంటను కొనుగోళ్లు చేయరా అని ప్రశ్నించారు. మార్కెట్‌కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలు ఎక్కడన్నారు. ఇందిరమ్మ రాజ్యమని చెప్పి దళారుల రాజ్యం తెస్తారా అని నిలదీశారు. బడే భాయ్ రాష్ట్రంలో పత్తి రైతుకు పట్టాభిషేకం చేస్తుండగా, ఛోటా భాయ్ పాలనలో మాత్రం పత్తి రైతు చిత్తవుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో పత్తికి మద్దతు ధరకు మించి రూ.8,257 ఇస్తున్నారని, మరి తెలంగాణలో రేతుకు చెల్లిస్తున్నది కేవలం రూ.5 వేలేనా అని ప్రశ్నించారు. రెండేండ్ల క్రితం పత్తి ధర రూ.10 నుంచి రూ.15 వేలు పలికిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ అనర్థం ఏమిటని ఎక్స్ వేదిగా మండిపడ్డారు.

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా

# ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఆగదు..





- ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షక కవచం కిట్ వినియోగం
- ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపు..

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టే సమయానికి ఆర్థికంగా రాష్ట్ర చాలా దెబ్బతిందని, ప్రతి నెలా వచ్చే 18 వేల కోట్ల ఆదాయంలో 6 వేల కోట్ల అప్పుల వడ్డీలకే ఖర్చు అవుతుందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం అంశంలో వెనుకాడటం లేదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు.మంగళవారం వేములవాడ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, సిరిసిల్ల కలెక్టరేట్లో నిర్వహించిన కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ హాజరై కిట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గీత కార్మికులు ఈత చెట్లు,తాడి చెట్లు ఎక్కి ప్రమాదాల వల్ల వైకల్యం పొందడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని, దీనిని నివారించేందుకు సాంకేతికంగా ఒక కిట్ ను తయారు చేసి, దానికి కాటమయ్య రక్షణ కిట్టు పేరుతో పంపిణీ చేస్తున్నామని అన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ ప్రవేశ పెట్టామని, 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల ఏర్పాటు చేస్తున్నామని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. రేషన్ కార్డ్ స్థానంలో త్వరలోనే ఫ్యామిలీ కార్డు అందజేయడం జరుగుతుందని, ఆ కార్డు ద్వారా ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అందుతాయని అన్నారు.

ప్రతి రోజు ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పని చేస్తుందని, ఇటీవల జరిగిన అసెంబ్లీలో కూడా ఉదయం ప్రారంభించి మరునాడు ఉదయం 3 గంటల వరకు ప్రజా సమస్యల మీద చర్చించడం జరిగిందని, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పై ఎవరైనా సూచన అందిస్తే దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. వేములవాడ దేవాలయం అభివృద్ధికి నిధులు తెచ్చుకున్నామని, అదేవిధంగా దశాబ్దాల కల వేములవాడలో నూలు యార్డ్ ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు.

ముంపు గ్రామాల ప్రజలకు ఉన్న ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నమని అన్నారు. సామూహికంగా పెద్ద ఎత్తున ఈత చెట్లు పెంచే అవకాశాలను పరిశీలించి ఆ దిశగా చర్యలు చేపడతామని ప్రభుత్వ విప్ తెలిపారు. కాలువలకు ఇరు వైపులా ఈత చెట్లు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు అన్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల, వేములవాడ లో పర్యటించాల్సి ఉందని, ఢిల్లీలో వచ్చిన కార్యక్రమం వల్ల అప్పుడు సీఎం రావడం కుదరలేదని, వచ్చే నెలలో సీఎం రేవంత్ మన జిల్లాకు పర్యటించే అవకాశం ఉందని అన్నారు.

గ్రామాలు కుల వృత్తులతో అభివృద్ధి సాధించాయని, గతంలో కూడా అనేక పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను తాము అమలు చేశామని అన్నారు. బియ్యం పంపిణీ నుంచి ఉచిత విద్యుత్తు, ఫీజు రియంబర్స్మెంట్, 108 వాహనాలు, ఆర్టిసి బస్సులలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. గీత కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూములలో సామూహికంగా పెద్ద ఎత్తున ఈత చెట్లు పెంచే అవకాశాలను పరిశీలించి ఆ దిశగా చర్యలు చేపడతామని అన్నారు . కాలువలకు ఇరు వైపులా ఈత చెట్లు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఈత, తాటి చెట్లను పెంచాలని అన్నారు.

జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన కాటమయ్య రక్షక కవచ కిట్లను వినియోగించుకోవాలని అన్నారు. గతంలో అనేక ప్రమాదాలు జరిగేవని, వాటిని నివారించేందుకు ప్రభుత్వం సేఫ్టీ పరికరాలను అందించడం చాలా సంతోషకరమని అన్నారు. ప్రతి గీత కార్మికుడికి రక్షక కిట్ లు చేరాలని, దీనిని వారు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు.

సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రాణి మాట్లాడుతూ,తన చిన్నతనంలో తాటి చెట్టు పై నుంచి గీత కార్మికుడు ప్రమాదానికి గురై మరణించడం గమనించానని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు ఎక్కడా జరగకుండా ప్రభుత్వం భావించి అందిస్తున్న కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ చేస్తుందని దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గాలలో 200 మంది ఎంపిక చేసిన లబ్ధిదారులకు రక్షక కిట్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ రక్షక కిట్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, దీని వినియోగం పై కార్మికులకు శిక్షణ సైతం అందించామని, దీనిని కార్మికులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, బీ.సి సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్, అబ్కారీ శాఖ అధికారి పంచాక్షరీ, ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 132 మంది నూతన టీచర్లకు ఆప్షన్స్ ద్వారా పోస్టింగ్స్..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలోని డీఎస్సీ పరీక్ష ద్వారా ఎంపికైన 132 మంది నూతన టీచర్లకు జిల్లాలో ఖాళీగా గల పోస్టులకు ఆప్షన్స్ ద్వారా కేటాయిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నూతన టీచర్లకు పోస్టింగ్ కౌన్సిలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్ష ద్వారా నూతనంగా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్, వ్యాయామ ఉపాధ్యాయులకు రాష్ట్ర ముఖ్యమంత్రి అక్టోబర్ 9న నియామక పత్రాలు అందజేయడం జరిగిందని అన్నారు . సమీకృత జిల్లా కలెక్టరేట్లో ఎంపికైన 132 మంది నూతన టీచర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ కేటాయించడం జరుగుతుందని, వీరు అక్టోబర్ 16న కేటాయించబడిన పాఠశాలలో జాయిన్ కావాల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ , సంబంధిత అధికారులు, నూతన ఉపాద్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి సాయం



- రూ. లక్ష 42 వేలు మంజూరు చేసిన కలెక్టర్,

**బలగం టీవీ, సిరిసిల్ల :**

సిరిసిల్లలోని గణేష్ నగర్ కు చెందిన కోడం హరికిషన్ కుమారుడు బోన్ క్యాన్సర్ తో ఇబ్బంది పడుతున్నాడు. తమ కుమారుడిని ఆదుకోవాలని బాలుడి తండ్రి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కి విన్నవించగా, స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రూ.ఒక లక్ష 42 వేల చెక్కు మంజూరు చేయగా, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన రేగుల జ్యోతికి 27వేల రూపాయలు,చెప్యల లత 21వేల రూపాయలు రమ్య 5500,రూపాయల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. నిరుపేదల కుటుంబాల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో అండగా ఉంటుందని గ్రామ శాఖ అధ్యక్షులు గుర్రం రవీందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ అండ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ మాజీ ఎంపీటీసీ బైరినేని రాము కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ డైరెక్టర్ నారాయణ గౌడ్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల వెంకటేష్ ,రేగుల ఎల్లయ్య, బోలవేణి అనిల్,మరిపల్లి మల్లికార్జున్,గుర్రం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ కీలక సమావేశం

**బలగం టీవీ , హైదరాబాద్**

ఈ నెల 16న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కీలక సమావేశం జరగనుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం కానున్నారు. హైడ్రా, మూసీ సుందరీకరణపై చర్చించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా హైడ్రా, మూసీ సుందరీకరణ విషయంలో బీఆర్ఎస్ పార్టీ తమ కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది.

## ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు



- కెనడాకు మళ్లింపు..

**బలగం టీవీ , హైదరాబాద్**

బాంబు బెదిరింపు దరిమిలా ఢిల్లీ నుంచి చికాగో వెళుతున్న ఎయిర్ ఇండియా విమానాన్ని కెనడాలోని విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌లైన్ అధికారి ఒకరు మంగళవారం వెల్లడించారు. మంగళవారం ఢిల్లీ నుంచి చికాగో వెళుతున్న ఎఐ127 విమానాన్ని ఆన్‌లైన్‌లో వచ్చిన భద్రతా ముప్పు కారణంగా ముందు జాగ్రత్త చర్యగా కెనాడలోని ఇకలుయిట్ విమానాశ్రయంలో ల్యాండ్ చేసినట్లు ఆ అదికారి చెప్పారు. సెక్యూరిటీ ప్రొటోకాల్ ప్రకారం ప్రయాణికులందరినీ మరోసారి తనిఖీలు చేసినట్లు ఆయన చెప్పారు. విమానంలో అనుమానాస్పద వస్తువేదీ లభించలేదని ఆయన వివరించారు. కాగా..సోమవారం ముంబై నుంచి న్యూయార్క్ వెళుతున్న ఎయిర్ ఇండియా విమానాన్ని బాంబు బెదిరింపు కారణంగా ఢిల్లీకి మళించారు. ఇటీవలి రోజులలో తమ ఎయిర్‌లైన్స్‌తోపాటు ఇతర ఎయిర్‌లైన్స్‌కు కూడా బాంబు బెదిరింపులు తరచు వస్తున్నట్లు ఎయిర్ ఇండియా తెలిపింది. ఈ బెదిరంపులన్నీ బూటకపు బెదిరింపులేనని తర్వాత తేలినప్పటికీ బాధ్యతగల ఎయిర్‌లైన్స్‌గా తాము వీటిని బేఖాతారు చేయలేమని తెలిపింది. ఈ బెదిరింపులకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని జరిగిన నష్టానికి పరిహారాన్ని వసూలు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని ఎయిర్ ఇండియా తెలిపింది.



## రెండు రాష్ట్రాల ఎన్నికల పరిశీలకులుగా తెలంగాణ మంత్రులు

**బలగం టీవీ , హైదరాబాద్**

మహారాష్ట్ర, ఝూర?ండ్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో తెలంగాణ నుంచి ముగ్గురికి చోటు కల్పించింది. మహారాష్ట్రలోని 5 డివిజన్లకు 11 మందిని నియమించగా.. వీరిలో రాష్ట్ర మంత్రులు ఉత్తమకుమార్ రెడ్డి, సీతక్క ఉన్నారు. ఝార్ఖండ్ కు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఆ పార్టీ సీనియర్ నేతలు తారిక్ అన్వర్, అధిర్ రంజన్ చౌదరిని నియమించారు.

## అదృశ్యమైన ఏడేండ్ల బాలిక.. గోనెసంచిలో శవమై..

**బలగం టీవీ , హైదరాబాద్**

మూడు రోజుల క్రితం అదృశ్యమైన ఏడేండ్ల బాలిక.. గోనెసంచిలో శవమై కనిపించింది. ఈ విషాద ఘటన సూరారంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్‌కు చెందిన భార్యాభర్తలిద్దరూ బతుకుదెరువు కోసం తన కూతురి(7)తో కలిసి మేడ్చల్ జిల్లాలోని సూరారం వచ్చారు. గత ఏడు నెలల నుంచి అక్కడే నివాసం ఉంటు న్నారు. అయితే అక్టోబర్ 12 ఏడేండ్ల బిడ్డ అదృశ్యమైంది. దీంతో ఆందోళనకు గురైన బాలిక తల్లిదండ్రులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే బుధశారం మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి పరిధిలోని బాసరగడి వద్ద బ్యాగులో మృతదేహం ఉన్న విషయాన్ని స్థానికులు గమనించారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన సూరారం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలికపై లైంగికదాడి చేసి హత్య చేశారా..? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా..? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## జ్యువినైల్ హోంలో లైబ్రరీ, యోగా కేంద్రం ఏర్పాటు చేస్తాం

- మంత్రి సీతక్క

బాల నేరస్థుల సంక్షేమం దృష్ట్యా జ్యువినైల్ హోంలో లైబ్రరీ, యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. స్ఫూర్తి ప్రదాతల పుస్తకాలు అందుబాటులో ఉంచుతామన్నారు. బాల నేరస్థుల్లో పరివర్తన తీసుకొస్తామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్ సైదాబాద్‌లోని రాష్ట్ర జ్యువినైల్ హోంలో విద్యార్థుల విలు విద్య ప్రదర్శన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జువినైల్ హోమ్ అంటేనే పరివర్తన కేంద్రమనే అర్థం వస్తుందన్నారు. ఇక్కడి నుంచి మంచి లక్షణాలతో బయటకు వెళ్ళాలని, అంతేకాకుండా ఎదుటి వారిని గౌరవించి, ప్రేమించి, అభిమానించాలని సూచించారు. సమాజంలో చక్కగా మెలుగుతూ, చిన్న పొరపాటు కూడా చేయకూడదని హితబోధ చేశారు. జువినైల్ హోంలో ఉన్నన్ని రోజులు శిక్షా కాలం కాదని, శిక్షణా సమయమన్నారు. జ్యువినైల్ హోం నుంచి విడుదలైన తర్వాత తల్లిదండ్రుల వద్దకు క్షేమంగా చేరుకోవాలని మంత్రి సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లో జ్యువినైల్ హోంకు రావాల్సి వచ్చిందో, ఆ పరిస్థితుల ప్రభావం మళ్లి జీవితంలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని మంత్రి కోరారు.

ఈ అబ్జర్వేషన్ హోం మీకు కచ్చితంగా అండగా ఉంటుందని, మానసికంగా బలోపేతమై సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు మిమ్మల్ని చూసి గర్వించే స్థాయికి ఎదగాలన్నారు. జాతిపిత గాంధీజీ బోధనలు అనుసరించి సోదర భావంతో మెలగాలని కోరారు. మానసికంగా, శారీరకంగా ఎదిగి మీ సృజనాత్మకతకు పదును పెట్టాలన్నారు. ఇందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందన్నారు. జ్యువినైల్ హోంలో సిబ్బంది మానవతా దృక్పథంతో పని చేయాలని మంత్రి ఆదేశించారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**బలగం టీవీ , ముంబై**

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లుఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. చివరకు నష్టాలను మూటకట్టుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 152 పాయింట్లు కోల్పోయి 81,820కి పడిపోయింది. నిఫ్టీ 70 పాయింట్లు నష్టపోయి 25,057కి దిగజారింది.


బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్: ఐసీఐసీఐ బ్యాంక్ (1.90%), భారతి ఎయిర్ టెల్ (1.26%), ఏషియన్ పెయింట్స్ (1.01%), అల్ట్రాటెక్ సిమెంట్ (0.83%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (0.76%).

టాప్ లూజర్స్: బజాజ్ ఫైనాన్స్ (−2.73%), రిలయన్స్ (−2.09%), టాటా స్టీల్ (−1.67%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (−1.19%), టాటా మోటార్స్ (−1.14%).

## 84 లక్షల వాట్సాప్ ఖాతాలపై నిషేధం

**బలగం టీవీ , ముంబై**

సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రైవసీ పాలసీని ఉల్లంఘించిన 84.58 లక్షల ఖాతాలను వాట్సాప్ బ్యాన్ చేసింది. ఒక్క ఆగస్టులోనే ఈ సంఖ్యలో నిషేధం విధించినట్లు పేర్కొంది. వీటిలో అనుమానాస్పదంగా ఉన్న 16.61 లక్షల అకౌంట్లను ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా ముందుగానే గుర్తించి జాగ్రత్త చర్యగా బ్యాన్ చేసినట్లు తెలిపింది. కాగా ఆగస్టులో వాట్సాప్ గ్రీవెన్స్‌కు 10,707 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించింది.




## గచ్చిబౌలిలో దారుణం

### యువతిపై ఆటోడ్రైవర్ లైంగికదాడి

**బలగం టీవీ , హైదరాబాద్**

ఆటోలో ఎక్కిన యువతిపై ఆటోడ్రైవర్ లైంగికదాడికి పాల్పడిన దారుణ సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డికి చెందిన యువతి గచ్చిబౌలిలోని ఓ నిర్మాణ సంస్థ కార్యాలయంలో పనిచేస్తోంది. యువతి మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఆర్‌సి పురం వద్ద నుంచి గచ్చిబౌలికి వెళ్లేందుకు ఆటోలో ఎక్కింది. ఆర్‌సి పురం నుంచి గచ్చిబౌలికి వస్తుండగా ఆటోడ్రైవర్ ఆటోను మసీద్‌బండవైపు తీసుకుని వెళ్లాడు. అక్కడ యువతిని బెదిరించిన ఆటోడ్రైవర్ లైంగికదాడి చేశాడు. తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. సంఘటన స్థలం నుంచి బాధితురాలు బయటికి వచ్చి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు.



## సల్మాన్ ఖాన్‌కి వై-ప్లస్ భద్రత..

**బలగం టీవీ , ముంబై**

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ భద్రతను వై ప్లస్‌కి అప్‌డేట్ చేశారు. ఎస్కార్ట్ వాహనం కూడా ఏర్పాటు చేశారు. అలాగే, శిక్షణ పొందిన సాయుధ కానిస్టేబుల్ సైతం వెంట వెళ్లనున్నాడు. ఆయనకు అత్యంత సన్నిత సంబంధాలున్న మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ లక్ష్యంగా చేసుకొని ఈ నెల 12న కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సల్మాన్ ఖాన్‌కు అదనపు భద్రతను భారీగా పెంచారు. సల్మాన్ ఖాన్ సిద్ధిఖీని హత్య చేసింది తామేనని లారెన్స్ బిష్ణోయ్ ప్రకటించిన నేపథ్యంలో భద్రతను పెంచుతూ మహారాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఇక సల్మాన్ ఖాన్ ఎక్కడికి వెళ్లినా పోలీసుల నిఘాలోనే ఉండనున్నాడు. సల్మాన్‌కు చెందిన పన్వెల్ ఫామ్‌హౌస్ చుట్టూ పోలీసులు భద్రతను పెంచారు. ఫామ్ హౌస్‌లోకి వెళ్లి, వచ్చే వారిని పర్యవేక్షించేందుకు సిబ్బందిని సైతం నియమించారు. సల్మాన్ ఖాన్‌ను హత్య చేస్తామంటూ గతంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హెచ్చరించింది.

# కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు



- నేడు బడుల్లో రిపోర్టింగ్ చేయనున్న ఉపాధ్యాయులు
- వివిధ కారణాలతో ఉదయం కౌన్సెలింగ్ వాయిదా
- మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైన కౌన్సెలింగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్ లభించింది. డీఎస్సీ-2024లో ఎంపికై.. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులకు మంగళవారం కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా జిల్లా విద్యాశాఖ పోస్టింగ్‌లను కేటాయించింది. అయితే సాంకేతిక సమస్యలతో కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్టు ఉదయం అధికారులు ప్రకటించారు. అయితే కాసేపటికే మళ్లీ అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు రావాలని అధికారులు ఫోన్లు చేసి చెప్పారు. వెంటనే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు.

జిల్లాల నుంచి డేటా సరిగా అందలేదని ఉదయం డీఎస్సీ అభ్యర్థులకు నిర్వహించాల్సిన పోస్టింగ్ కౌన్సెలింగ్‌ను అధికారులు వాయిదా వేశారు. అయితే జిల్లా డేటాను అందుకున్న అధికారులు ఆన్‌లైన్‌లో పెట్టడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో వాయిదా అని ప్రకటించిన కాసేపటికే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఇటీవల సీఎం చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్న వారంతా పోస్టింగ్ ఆర్డర్స్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఆయా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి చేరుకొని ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత పోస్టింగ్ ఆర్డర్స్ అందుకున్నారు. వారికి వచ్చిన మార్లులు ర్యాంకులు ఆధారంగా వారికి స్కూళ్లను కేటాయించారు అధికారులు. వాటి ఆధారంగానే పోస్టింగ్ ఆర్డర్స్ జారీ చేశారు. ఆయా స్కూల్స్‌లో జాయిన్ అయ్యేందుకు గడువు ఇచ్చారు. గడువులలోపు ఆయా స్కూల్స్‌లో జాయిన్ అవ్వాల్సి ఉంటుంది.

## టెక్నాలజీ వినియోగం విషయంలో నిబంధనలను రూపొందించాలి




- ప్రధాని మోడీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞాన వినియోగం విషయంలో నిబంధనలను రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అందుకోసం అంతర్జాతీయ సంస్థలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలీకమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ-2024 ను ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించారు. అలాగే దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ ఈవెంట్ 8వ ఎడిషన్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమానయాన రంగానికి గ్లోబల్ కమ్యూనిటీ సమగ్రమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించినట్లే, డిజిటల్ ప్రపంచానికి కూడా నియమాలు, నిబంధనలు అవసరమని అన్నారు.'భారతదేశంలో 120 కోట్ల మొబైల్?, 95 కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారు. ప్రపంచంలోనే 40 శాతానికి పైగా డిజిటల్ లావాదేవీలు భారతదేశంలో జరుగుతున్నాయి. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విజయవంతంగా నిర్మించడంలో భారతదేశం తన అనుభవాన్ని ఇతర దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉంది. కేవలం పదేళ్లలోనే ఏర్పాటు చేసిన ఆప్టికల్ ఫైబర్- భూమి, చంద్రుని మధ్య దూరం కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ. రెండు సంవత్సరాల క్రితం మొబైల్? కాంగ్రెస్‌లోనే 5జీ సేవలను ప్రారంభించాం. దేశంలోని ప్రతి జిల్లాను 5జీ సేవలతో అనుసంధానం చేశాం. ఇప్పుడు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద 5జీ మార్కెట్‌గా భారతదేశం అవతరించింది. ప్రస్తుతం 6జీ టెక్నాలజీ కోసం తీవ్రంగా కృషి చేస్తున్నాం.' అని మోదీ తెలిపారు.

## గ్రూప్-1 మెయిన్స్‌కు హైకోర్టు గ్రీన్ స్నిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగనున్నాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు. వీటికి సంబంధించిన ఏర్పాట్లను టీజీపీఎస్సీ ఇప్పటికే పూర్తిచేసింది. సోమవారం హాల్‌టికెట్లను సైతం విడుదల చేసింది. పరీక్షకు ఒకరోజు ముందు అంటే ఈ నెల 21 వరకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయి. ఈ పరీక్షలకు 31,382 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

## సేవ చేయాలని లేదా...?

- ఐఏఎస్‌లను ప్రశ్నించిన క్యాట్
- ఐఏఎస్‌ల అభ్యర్థనపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరిం చిన క్యాట్
- హైకోర్టును ఆశ్రయించనున్న ఐఏఎస్‌లు




**బలగం టీవీ, హైదరాబాద్**

ఈ నెల 9న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కె. ఆమ్రపాలి, ఎ. వాణీప్రసాద్, డి. రొనాల్డ్‌రాస్, జి. సృజనలకు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట దక్కలేదు. డీఓపిటి ఇచ్చిన ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ నిరాకరించింది. ప్రతివాదులైన కేంద్రం, డివోపిటికి నోటీసులు జారీ చేస్తూ విచారణను వచ్చేనెల 5వ తేదీకి వాయిదా వేసింది. ఐదవ తేదీలోపు కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను క్యాట్ ఆదేశించింది.

పిటిషన్‌పై విచారణ సందర్భంగా క్యాట్ కీలక వ్యాఖ్యలు చేసింది. "ఏపీలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి చోటుకు వెళ్లి వారికి సేవ చేయాలని మీకు లేదా? ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకి పూర్తి అధికారాలు ఉన్నాయి. స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం గైడ్‌లైన్స్‌లో ఉందా?" అని క్యాట్ ప్రశ్నించింది.

వన్ మ్యాన్ కమిటీ సిఫారసులను డీవోపీటీ పట్టించుకోవడం లేదని ఐఏఎస్ అధికారుల తరపు న్యాయవాది క్యాట్ దృష్టికి తెచ్చారు. సింగిల్‌మెన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్రం ఉత్తర్వులు జారీ చేసే ముందు కమిటీ నివేదికను ఇవ్వలేదన్నారు. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్‌రాస్‌లు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఏపీలో పనిచేస్తున్న సృజన, హరికిరణ్, శివశంకర్ తెలంగాణకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తాము పని చేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. కేటాయింపుల సమయంలో కేంద్రం తమ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వాదనల అనంతరం డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. ఇదిలావుంటే క్యాట్ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయిస్తామని ఆ ఐఏఎస్ అధికారుల తరపున న్యాయవాదులు తెలిపారు.

## ఇంగ్లండ్‌పై విండీస్ విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**



మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై వెస్టిండీస్ సంచలన విజయం సాధించింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో విండీస్ 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఈ గెలుపుతో విండీస్ సెమీస్ బెర్త్ సొంతం చేసుకోగా.. ఇంగ్లండ్ మాత్రం అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. గ్రూప్-బిలో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు చెరో 6 పాయింట్లతో సమానంగా నిలిచాయి. కానీ మెరుగైన రన్‌రేట్ కారణంగా వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచి నాకౌట్‌కు అర్హత సాధించాయి. అంతకుముందు గ్రూప్-ఏ నుంచి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ టీమ్స్ సెమీస్‌లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే.

తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. నాట్ సీవెర్ బ్రంట్ (57 నాటౌట్, 50 బంతుల్లో 5 ఫోర్లు) హాఫ్ సెంచరీతో రాణించగా.. మితగా బ్యాటర్లు విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో ఫ్రెచర్ 3 వికెట్లు తీయగా.. హెలే మాథ్యూ 2 వికెట్లు పడగొట్టింది.అనంతరం 142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ 18 ఓవర్లలోనే 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు ఖియానా జోసెఫ్ (52, 38 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హీలె మాథ్యూస్ (50, 38 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) సూపర్ హాఫ్ సెంచరీలతో చెలరేగారు. వీరు అవుటైనా డాటిన్ (19 బంతుల్లో 27), ఆలియా అల్లె నీ (8 నాటౌట్) దూకుడుగా ఆడటంతో విండీస్ భారీ విజయంతో ఐదోసారి ప్రపంచకప్ సెమీస్‌లోకి దూసుకెళ్లింది.ఇక గురువారం జరిగే తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియా - దక్షిణాఫ్రికా, శుక్రవారం జరిగే రెండో సెమీస్‌లో న్యూజిలాండ్ -వెస్టిండీస్ తలపడనున్నాయి.

## గురుకులాలు అద్దెలు చెల్లించేందుకు డబ్బులు లేవా..?

### బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ తెలంగాణలో గురుకులాలు మూసివేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గురుకులాలకు అద్దెలు ఇంకెప్పుడు చెల్లిస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో రోజురోజుకి దిగజారి పోతున్న విద్యావ్యవస్థ గురించి విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న మీరు ఇంకెప్పుడు పట్టించుకుంటారని నిలదీశారు. గత 10 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో యజమాని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌కు తాళం వేశారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాల నిర్వహణ అధ్వాన్న స్థితికి చేరుకుందనడానికి ఇది మరొక నిదర్శనమంటూ ఫైర్ అయ్యారు. ఇలా మూత పడటం దిగజారుతున్న విద్యావ్యవస్థకు పరాకాష్ట అంటూ వ్యాఖ్యానించారు హరీశ్ రావు..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ ఢిల్లీకి మూటలు పంపేందుకు, కమీషన్లు వచ్చే బడా కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు వేల కోట్లు ఉన్నాయి కానీ.. పేద విద్యార్థులు చదువుకునే గురుకులాల అద్దెలు చెల్లించడానికి పైసలు లేవా ? అని ప్రశ్నించారు

## నేడు, రేపు వానలు

రాష్ట్రంలో బుధ, గురువారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ అంతటా వర్షాలు కురుస్తాయని తెలిపింది. దీంతో వివిధ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# భారత్ న్యూజిలాండ్ మ్యాచ్ జరిగేనా..?

## బెంగళూరులో నేడు రేపు వర్షాలు కురిసే అవకాశం



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్–న్యూజిలాండ్ మధ్య బుధవారం నుంచి బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనున్న తొలి టెస్టు సందేహంలో పడింది. మ్యాచ్‌కు వరుణుడు అడ్డంకులు సృష్టించేలా ఉన్నాడు. మ్యాచ్ జరిగే ఐదు రోజులూ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. మంగళవారం ఉదయం ప్రారంభమైన వర్షం కురుస్తూనే ఉండడంతో భారత జట్టు ప్రాక్టీస్ సెషన్ కూడా రద్దయింది.

భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టుకి బెంగళూరు ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఇప్పటికే అక్కడికి చేరుకున్న ఇరు జట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్ చేస్తున్నారు. భారత్ జట్టు ఇటీవల బంగ్లాదేశ్‌తో ముగిసిన రెండు టెస్టుల సిరీస్‌లో అద్భుతమైన విజయాల్ని అందుకుని మంచి జోరుమీదుంది. దాదాపు రెండు వారాలు భారత టెస్టు టీమ్‌కి రెస్ట్ కూడా దొరికింది. అన్నింటికీ మించి ఐసీసీ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో నెం.1 స్థానాన్ని భారత్ మరింత పదిలం చేసుకుంది.

ఇక న్యూజిలాండ్ టీమ్ గత కొన్ని నెలలుగా టెస్టుల్లో పేలవ ప్రదర్శనతో నిరాశపరుస్తోంది. వరుసగా ఆస్ట్రేలియా, శ్రీలంక చేతిలో టెస్టు సిరీస్‌ను ఓడిపోయి తీవ్ర ఒత్తిడిలో భారత్ గడ్డపై ఆ జట్టు అడుగుపెట్టింది. తన కంటే బలహీనంగా ఉన్న శ్రీలంక చేతిలో ఇటీవల రెండు టెస్టుల సిరీస్‌లో న్యూజిలాండ్ చిత్తుగా ఓడిపోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది.

మూడు టెస్టు మ్యాచ్‌లూ ఉదయం 9.30 గంటలకి ప్రారంభంకానున్నాయి. అయితే.. మ్యాచ్ తొలి రోజు టాస్ ఉదయం 9 గంటలకే పడనుంది. ఇక మ్యాచ్‌లను లైవ్‌లో స్పోర్ట్స్ 18 ఛానల్‌లో చూడవచ్చు. ఓటీటీలో చూడాలనుకుంటే జియో సినిమాలో ప్రత్యక్షంగా వీక్షించొచ్చు.

**భారత్ టెస్టు జట్టు**

రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైశ్వాల్, శుభమన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, మమ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా (వైస్ కెప్టెన్), ఆకాశ్ దీప్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్).

**న్యూజిలాండ్ జట్టు**

టామ్ లాథమ్ (కెప్టెన్), టామ్ బ్లండెల్ (వికెట్ కీపర్), మ్యాట్ హెన్రీ, డార్లీ మిచెల్, విల్ ఓ రూర్కే, అజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్, మైఖేల్ బ్రేస్ వెల్ (మొదటి టెస్టుకి మాత్రమే), మార్క్ చాప్మన్, దేవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, మిచెల్ శాంట్నర్, బెన్ సియర్స్, ఇస్ సోధి (రెండు, మూడో టెస్టుకి మాత్రమే), టిమ్ సౌథీ, విల్ యంగ్, కేన్ విలియమ్సన్ (మొదటి టెస్టుకి అందుబాటులో లేదు)



# సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఇంపాక్ట్ ప్లేయర్ రద్దు

**బలగం టీవీ, హైదరాబాద్**

బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవాళీ టీ20 టోర్నమెంట్ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను తొలగించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని రాష్ట్ర సంఘాలకు సోమవారం తెలియజేసింది. ఇంపాక్ట్ ప్లేయర్ సబ్‌స్టిట్యూట్ రూల్‌ను ప్రయోగాత్మకంగా తొలుత సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో బీసీసీఐ అమలు చేసింది. అనంతరం ఐపీఎల్‌లోకి తీసుకువచ్చింది.అయితే ఈ నిబంధనపై మిశ్రమ స్పందన వచ్చింది. ఐపీఎల్‌లో ఎంతో మంది కెప్టెన్లు, కోచ్‌లు దీన్ని వ్యతిరేకించారు. ఈ రూల్ ఆల్‌రౌండర్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని ప్రధాన వాదన. ఇక ఐపీఎల్–2027 సీజన్ వరకు ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను కొనసాగిస్తామని ఇటీవల బీసీసీఐ ప్రకటించింది కూడా. కానీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మాత్రం రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఈ దేశవాళీ టీ20 టోర్నీ నవంబర్ 23 నుంచి డిసెంబర్ 15వరకు జరగనుంది.కాగా, సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో రెండు బౌన్సర్ల నిబంధనను మాత్రం కొనసాగిస్తున్నట్లు బీసీసీఐ స్పష్టం చేసింది. ఒక ఓవర్‌లో రెండు షార్ట్ పిచ్ బంతుల్ని వేయడానికి బౌలర్‌కు అనుమతి ఇవ్వడమే ఈ నిబంధన సారాంశం. తొలుత ముస్తాక్ అలీ టోర్నీలో ప్రయోగాత్మకంగా దీన్ని మొదలుపెట్టారు. ఆ తర్వాత ఐపీఎల్‌లో కూడా తీసుకువచ్చారు. బౌలర్లకు మేలు చేకూర్చే ఈ నిబంధనను మాత్రం దేశవాళీ టోర్నీలో, ఐపీఎల్‌లో కొనసాగించనున్నారు.




# ప్రపంచ షూటింగ్ వరల్డ్‌కప్‌లో భారత్‌కు సిల్వర్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ప్రపంచ షూటింగ్ వరల్డ్‌కప్‌లో భారత్‌కు రజత పతకం వచ్చింది. షూటర్ సోనమ్ ఉత్తమ్ మస్కర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ కొట్టింది. ఆ ఈవెంట్‌లో 252.9 పాయింట్లు ఆమె స్కోర్ చేసింది. చైనాకు చెందిన షూటర్ యుటింగ్ హువాంగ్ స్వర్ణ పతకం, ఫ్రాన్స్‌కు చెందిన ముల్లర్ కాంస్య పతకాలు గెలిచారు. 167.7 పాయింట్లతో తిలోత్తమ సేన్ ఆరవ స్థానంలో నిలిచింది.




# సాయి దుర్గ తేజ్ కొత్త సినిమా గ్లింప్స్...




**బలగం టీవీ, హైదరాబాద్**

సాయి దుర్గా తేజ్ 'బ్రో' సినిమా తర్వాత కొంచెం గ్యాప్ తీసుకొని ఇప్పుడు కొత్త సినిమాతో రాబోతున్నాడు. హనుమాన్ లాంటి సూపర్ హిట్ సినిమా ఇచ్చిన ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రోహిత్ దర్శకత్వంలో సాయి దుర్గ తేజ్ తన తరువాతి సినిమా చేయబోతున్నాడు. ఈ సినిమాలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్ గా నటిస్తుంది. పీరియాడిక్ యాక్షన్ సినిమాగా ఇది తెరకెక్కబోతుంది సమాచారం. మంగళవారం సాయి దుర్గ తేజ్ పుట్టిన రోజు సందర్భంగా ఎస్‌డీటీ 18 సినిమా నుంచి మేకింగ్ వీడియో రిలీజ్ చేసారు. ఈ వీడియో పీరియాడిక్ లుక్ లో భారీ యాక్షన్ సినిమాగా ఉండబోతుందని తెలుస్తుంది. ఇక ఈ సినిమా కోసం సాయి ధరమ్ తేజ్ బాడీ కూడా బాగా పెంచడాన్ని తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ మేకింగ్ వీడియో వైరల్ గా మారింది. ఇది జస్ట్ బిగినింగ్ మాత్రమే అంటూ వీడియో చివర్లో చెప్పడంతో మెగా ఫ్యాన్స్ ఈ సినిమాపై అంచనాలు పెట్టుకుంటున్నారు.

# వరుణ్ ధావన్, సమంత 'సిటాడెల్ హనీ బన్నీ' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




వరుణ్ ధావన్, సమంత రూత్ ప్రభు జంటగా నటించిన అత్యంత ఆసక్తికర యాక్షన్ సిరీస్ 'సిటాడెల్. హనీ బన్నీ' ట్రైలర్ విడుదలైంది. ఈ సిరీస్‌లో వరుణ్ ధావన్ స్టంట్‌మ్యాన్ బన్నీగా, సమంత ఏజెంట్ హనీగా డిటెక్టివ్ పాత్రల్లో కనిపించనున్నారు. దాదాపు 2 నిమిషాల 51 సెకన్ల నిడివి గల ఈ ట్రైలర్ యాక్షన్ ప్యాక్డ్ సీన్స్‌తో నిండిగా ఉండి, థ్రిల్‌ను పెంచుతోంది. ట్రైలర్‌లో ఉన్నత స్థాయి యాక్షన్ సన్నివేశాలతో పాటు తుపాకీ కాల్పులు, భారీ విజువల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సమంత, వరుణ్‌లుగా హనీ, బన్నీ పాత అనుబంధాన్ని పునరుద్ధరించుకుంటారు. స్టైలిష్ యాక్షన్‌తో నిండిన ఈ సిరీస్‌లో కె.కె. మీనన్, సిమ్రాన్, సాకిబ్ సలీమ్, సికందర్ ఖేర్ వంటి ప్రతిభావంతులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సిటాడెల్: హనీ బన్నీ' నవంబర్ 7న ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. ఈ సిరీస్‌ను భారతదేశంతో పాటు 240కి పైగా దేశాల్లో విడుదల చేయనున్నారు. రాజ్–డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్టులో కేకే మీనన్, సిమ్రన్, సోహం మజుందార్, శివంకిత్ పరిహార్, కశ్వీ మజుందార్, సాఖిబ్ సలీం, సికిందర్ ఖేర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సిటడెల్‌ను రాజ్ అండ్ డీకే డీ2ఆర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రాజ్‌అండ్ డీకే, సీతా మీనన్ కథనందించారు.